క్లుప్తంగా

వెండి కవచంతో అలంకరణ


వెండి కవచంతో చౌడేశ్వరి అమ్మవారు

నరసన్నపేట: స్థానిక ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని చౌడేశ్వరి అమ్మవారిని 15 కేజీల వెండి కవచంతో సోమవారం అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేపట్టామని ఆలయ ప్రధాన అర్చకులు విభూది జయశంకర్ తెలిపారు.

బోరు ప్రారంభం


బోరు ప్రారంభిస్తున్న లక్ష్మణరావు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులోని ఎస్సీ బాలుర వసతి గృహానికి అనుకొని ఉన్న రెల్లివీధిలో బోరును వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు సోమవారం ప్రారంభించారు. తాగునీరు లేకపోవడంతో రెల్లివీధి ప్రజలు పలు అవస్థలు పడుతున్నారు. దీంతో బోరు వేయించాలని సర్పంచ్ పడాల కృష్ణవేణికి కోరారు. తాగునీటి సమస్యను గుర్తించిన సర్పంచ్ తాగునీటి బోరును మంజూరు చేసి తవ్వించారు. ఈ బోరును పడాల లక్ష్మణరావు ప్రారంభించారు. కార్యక్రమంలో లోకొండ లక్ష్మణరావు, ఎస్.రాజా, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో వేతనాలు అందించాలి


ఎంఈవోకు వినతిపత్రం అందిస్తున్న శానిటరీ వర్కర్లు

పొందూరు: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తమకు సకాలంలో వేతనాలు చెల్లించాలని శానిటరీ వర్కర్లు కోరారు. ఈ మేరకు ఎంఈవో పట్నాన రాజారావుకు సోమవారం వినతిపత్రం అందించారు. పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుతూ విద్యార్థుల ఆరోగ్యం కాపాడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు రాంబిల్లి సత్యనారాయణ, శానిటరీ వర్కర్లు కోరాడ పార్వతి, నల్లా పద్మ, డొంక రజాలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అనిల్

జలుమూరు: మండలంలోని పాగోడు – బుడితి జంక్షన్ మధ్య సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. బుడితి జంక్షన్ నుంచి స్కూటీపై ఓ మహిళ వస్తోంది. అదే సమయంలో జలుమూరు నుంచి శ్రీముఖలింగంకు పోలాకికి చెందిన కె.అనిల్ వెళ్తున్నాడు. ఈ సమయంలో ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో అనిల్‌కు తలకు తీవ్రమైన గాయమైంది. వెంటనే అనిల్‌ను 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్కూటీతో వస్తున్న మహిళ వివరాలు తెలియాల్సి ఉంది. ఆమెను కూడా ఓ కారులో బంధువులు ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

అట్రాసిటీ చట్టంపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ ప్రవల్లిక

బూర్జ: మండలంలోని కురింపేట గ్రామంలో స్థానిక పోలీసుస్టేషన్ ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక ఆధ్వర్యంలో ప్రజలు, విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించారు. సోమవారం ఆమె ప్రజలతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం, మైనర్లు వాహనాలు నడిపితే కలిగే ప్రమాదాలపై వివరించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు ప్రజలు సద్వినియోగపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పంట వ్యాపారం వారిదే..!


రోడ్డు పక్కన జొన్నపొత్తుల కట్టలు కడుతున్న వ్యాపారులు

- మొక్కజొన్నతో ఊరంతా జీవనోపాధి
- సీజన్‌తో పనిలేకుండా పెద్దకోట గ్రామస్తుల సాగు
- మండల కేంద్రమే వ్యాపార కేంద్రం


బస్‌లో ప్రయాణికులకు విక్రయిస్తున్న జొన్నపొత్తుల కట్టలు

ఎల్.ఎన్.పేట: దశాబ్దాలుగా మొక్కజొన్ననే నమ్ముకొని జీవిస్తున్నారు మండలంలోని పెద్దకోట గ్రామానికి చెందిన ప్రజలు. వారికి మొక్కజొన్న సాగుతోపాటు వ్యాపారం జీవనోపాధిగా మారిపోయింది. మండల కేంద్రంలోని అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డు పక్కన మొక్కజొన్న పొత్తులు బస్తాలతో ఉంచుకుని, వాటిని కట్టలు కడుతూ విక్రయిస్తుంటారు. ఈ గ్రామంలో సుమారు 180 కుటుంబాల ప్రజలు నివసిస్తుంటారు.

సొంత పొలంలోనే సాగు

పెద్దకోట గ్రామానికి చెందిన సుమారు వంద కుటుంబాలు వారికి ఉన్న పొలంలో మొక్కజొన్న, స్వీట్‌కార్న్ పంటను పండిస్తారు. కోతకు వచ్చిన తర్వాత వాటిని బస్తాలతో మండల కేంద్రానికి తీసుకుని వచ్చి వారే విక్రయిస్తుంటారు. ఐదు మొక్కజొన్న పొత్తులను కట్టగా కట్టి ఒక కట్ట దాదాపు రూ.50 లకు విక్రయిస్తారు. మండల కేంద్రానికి ఆటోలు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, కారులు, ఇతర వాహనాలపై వచ్చే వారి వద్దకు కట్టలు తీసుకుని వెళ్లి విక్రయిస్తుంటారు. మొక్కజొన్న పొత్తులు ఒక మనిషి రోజుకు తక్కువగా చెప్పుకున్నా రూ.3 నుంచి రూ.5 వేలు వరకు విక్రయిస్తారు.

రైతుల వద్ద కొనుగోలు చేసి

అదేవిధంగా పాతపట్నం నియోజకవర్గంలోని పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల్లోనూ మొక్కజొన్న సాగు జరుగుతోంది. ఎల్.ఎన్.పేట మండలం పెద్దకోట, బసవరాజుపేట, లక్ష్మీనర్సుపేట గ్రామాలతో పాటు పలు ప్రాంతాల రైతుల వద్దకు పెద్దకోట గ్రామస్తులు వెళ్లి మొక్కజొన్న పంటను పొలంలోనే కొనుగోలు చేస్తారు. పక్వానికి వచ్చిన వాటిని కోసి ఆటోల్లో ఎల్.ఎన్.పేట మండల కేంద్రానికి తీసుకుని వచ్చి కట్టలు కట్టి విక్రయిస్తుంటారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రతీ ఏడాది మొక్కజొన్న పంటతో పాటు కూరగాయల పంటలను పండిస్తాం. వాటినే అమ్ముకుని జీవనం సాగిస్తుంటాం. మాలాంటి వారిని ప్రభుత్వం గుర్తించి బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. మండల కేంద్రంలో మొక్కజొన్న పొత్తులు విక్రయించే కుటుంబాలకు చెందిన వారిని గుర్తించి వారికి ప్రభుత్వమే ఆదుకోవాలి.

జోగి దుర్గారావు, రైతు, పెద్దకోట, ఎల్.ఎన్.పేట

● రోడ్డు వేశారు.. కల్వర్టు మరిచారు



నరసన్నపేట మండలంలోని రావులవలసకు వెళ్లేందుకు శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అయితే రోడ్డు మార్గంలో కిల్లాం చానల్‌పై ఉన్న కల్వర్టు నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో కల్వర్టు పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. - నరసన్నపేట

● ఆందోళన



వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సారవకోట మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే వరి కోతలు ప్రారంభమై, ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. తుఫాన్ సూచన రావడంతో పండిన ధాన్యం తడిసిపోకుండా రక్షించుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. - సారవకోట

ఉచిత న్యాయ సహాయం వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

ఆమదాలవలస: ప్రభుత్వం, కోర్టు ద్వారా అందించే ఉచిత న్యాయ సహాయాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమదాలవలస సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి సూచించారు. కోర్టు ఆవరణలో జాతీయ న్యాయసేవ దినోత్సవం సందర్భంగా కక్షిదారులకు పలు చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయానికి టోల్‌ఫ్రీ నంబర్ 15100ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు కణిత విజయలక్ష్మి, న్యాయవాదులు కింతలి త్రినాథరావు, తమ్మినేని అన్నంనాయుడు, వరాహాలక్ష్మీనరసింహమూర్తి, గోవిందరావు, ఎ.విజయ్, అచ్చంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


కొత్తూరు: ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అహ్మద్


పొందూరు: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ

కొత్తూరు: ప్రస్తుతం పలు రకాల నేరాలు వలన ప్రజలు మోసపోతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్‌ఐ ఎంఏ అహ్మద్ సూచించారు. మండలంలోని కుంటిభద్ర గ్రామంలో సోమవారం సైబర్ నేరాలు, ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా సైబర్ నేరాలు జరిగినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒంటరిగా మహిళలు ప్రయాణాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

అప్రమత్తంగా ఉండాలి

పొందూరు: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ వి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని తాడివలస గ్రామంలో సైబర్ నేరాలు, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జరుగుతున్న మోసాలపై గ్రామస్తులకు సోమవారం అవగాహన కల్పించారు. తప్పుడు ఫోన్ నంబర్ల ద్వారా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొంతమంది మోసాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

శివోహం..!


మెళియాపుట్టి: చాపర శివాలయంలో దర్శనం కోసం క్యూలో ఉన్న భక్తులు

కార్తీకం రెండో సోమవారం పురస్కరించుకుని ఆలయాలన్నీ శివనామ స్మరణతో మార్మోగాయి. వేకువజాము నుంచే భక్తులు బారులుతీరారు. శివుడికి ప్రత్యేక, రుద్రాభిషేకాలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, దాతలు భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. - సాక్షి నెట్‌వర్క్


సారవకోట: అంగూరులో బారులుతీరిన భక్తులు


నరసన్నపేట: గుండవల్లిపేటలో సామూహిక రుద్రాభిషేకాలు


ఆమదాలవలస: రామలింగేశ్వరస్వామి ఆలయంలో...


పాతపట్నం: మహేంద్రతనయ నదీ తీరాన గంగ హారతిలో పాల్గొన్న భక్తులు


బూర్జ: ఉమా చండీశ్వర ఆలయంలో...


పాతపట్నం: నీలకంఠేశ్వర ఆలయంలో...


జలుమూరు: శ్రీముఖలింగంలో పూజలందుకుంటున్న స్వామివారు


కొత్తూరు: కూర్మదాసుపురం శివాలయంలో...


సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో...

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

జలుమూరు: సారవకోట గ్రామానికి చెందిన తెల్లి వెంకటేశ్ అనే యువకుడు అక్టోబర్ 31వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన తల్లి చంద్రావతి జలుమూరు పోలీసుస్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. గత రెండు రోజులుగా తిలారు రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఉన్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎల్.ఎన్.పేట: తుఫాన్ ప్రభావంతో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పొలం పనులు చేస్తున్న రైతులు అప్రమత్తం కావాలని మండల వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ సోమవారం ఒక ప్రకటనలో పలు సూచనలు చేశారు. గత వారం పది రోజులుగా వరిచేను కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. వరిచేను కోత కోయాలనుకునే రైతులు తమ పనులు వాయిదా వేసుకోవాలన్నారు. ఇప్పటికే పంట కోత కోసిన రైతులు పంటను కుప్పపెట్టి జాగ్రత్త చేసుకోవాలని సూచించారు. కోత యంత్రాల ద్వారా కోసి నూర్పుపూర్తి చేసిన ధాన్యం రాశులను జాగ్రత్త పర్చాలని పేర్కొన్నారు. పొలంలో నీరు నిల్వ లేకుండా పల్లం ప్రాంతాలకు వెళ్లేలా చిన్నచిన్న బట్టి (కాలువ)లు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సరుబుజ్జిలి: చాపకిందనీరులా విస్తరిస్తున్న క్యాన్సర్ మహమ్మారిపై అప్రమత్తంగా ఉండాలని పురుషోత్తపురం పీహెచ్‌సీ వైద్యాధికారి బమ్మిడి జ్యోతిర్మయి సూచించారు. స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో పంచాయతీ ఉప సర్పంచ్ పైడి నర్సింహప్పారావు అధ్యక్షతన సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పద్మ, కిల్లి సిద్ధార్థ పాల్గొన్నారు.

స్ప్రింక్లర్ పైపులతో మేలు


రైతులకు స్ప్రింక్లర్ పైపులు అందిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: స్ప్రింక్లర్ పైపులు అమర్చి వ్యవసాయం చేయడం వలన మేలు జరుగుతుందని ఉద్యానవనశాఖ అధికారులు శరత్ కుమార్ రెడ్డి, షణ్ముఖరావు అన్నారు. మండలంలోని మర్రిపాడు, కేరాసింగి రైతుసేవా కేంద్రాలకు సంబంధించిన 18 మంది రైతులకు 18 స్ప్రింక్లర్ యూనిట్లను సోమవారం పంపిణీ చేశారు. జీడి మామిడి తోటలకు డ్రిప్ పైపులు సైతం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

15న జన జాతీయ గౌరవ దివస్


మాట్లాడుతున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: శ్రీకాకుళం జిల్లా మెళియాపుట్టిలో నూతనంగా నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 15న జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపా రు. ఈ మేరకు సోమవారం ఆయన తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. ఏపీఓ చిన్నబాబు, ఇంజినీరింగ్ డీఈ సింహాచలం, డీడీ అన్నదొర తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

అపార్‌ను వేగవంతం చేయాలి


నరసన్నపేట: అధ్యాపకులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో విజయకుమారి


కొత్తూరు: హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

నరసన్నపేట: విద్యార్థులకు అనేక ప్రయోజనాలు కల్పించే అపార్‌ను వేగవంతం చేయాలని డిప్యూటీ డీఈవో విజయకుమారి సూచించారు. మండల కేంద్రం నరసన్నపేటలో ఎంఈవోలు దాలినాయుడు, శాంతారావు, సీఆర్పీలతో కలిసి ప్రత్యేక డ్రైవ్ సోమవారం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, స్కూల్స్‌కు వెళ్లి యాజమాన్యానికి, సిబ్బందికి సూచనలు చేశారు. రానున్న వారం రోజులూ దీనిపైనే దృష్టి పెట్టాలని ఆదేశించారు. అపార్ నమోదులో కావాలనే జాప్యం చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో మిగిలిన మండలాలు కంటే నరసన్నపేట వెనుకబడి ఉందని పేర్కొన్నారు.

ప్రతి విద్యార్థికీ అపార్ నమోదు

కొత్తూరు: ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుతున్న ప్రతి విద్యార్థికీ అపార్‌లో నమోదు చేయాలని ఎంఈవో శ్రీనివాసరావు, తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీవో నీరజలు సూచించారు. మండలంలో 90 శాతం కంటే తక్కువ మంది విద్యార్థులకు అపార్‌లో నమోదు చేసిన పాఠశాలల హెచ్‌ఎంలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 8,614 మంది విద్యార్థులు ఉండగా, ఇప్పటివరకు 6,030 మంది విద్యార్థులను అపార్ కార్డులు కోసం రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన విద్యార్థుల వివరాలను వేగవంతంగా నమోదు చేయాలని సూచించారు.

'అపార' కష్టాలు

సారవకోట: వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు సచివాలయాలు, ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం అపార్ విధానం తీసుకుని రావడంతో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. విద్యార్థుల చదువుతున్న పాఠశాలలో ఏ పుట్టిన తేదీ నమోదై ఉందో, అదే పుట్టిన తేదీ ఆధార్‌పై ఉండాలి. అయితే చాలా మంది విద్యార్థులకు పుట్టిన తేదీల నమోదు ఆధార్, పాఠశాల రికార్డుల్లో తేడా ఉండడంతో ప్రస్తుతం అపార్‌లో నమోదు చేయడానికి కుదరడం లేదు. దీంతో పాఠశాల సిబ్బంది ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పించాలని సూచిస్తున్నారు. దీంతో విద్యార్థులు తరగతులను విడిచిపెట్టి సచివాలయం, ఆధార్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. అయితే ఆధార్ కేంద్రాలు, సచివాలయాల్లో ఆధార్‌లో పుట్టిన తేదీ మార్చేందుకు లిఖిత పూర్వకంగా ఇచ్చిన పుట్టిన తేదీ ధ్రువపత్రాలు పనికిరావని అక్కడి సిబ్బంది తిరిగి పంపిస్తున్నారు. అలాగే వేరే రాష్ట్రంలో పుట్టి అక్కడ ఆస్పత్రి వర్గాలస్పాసి ఇచ్చిన పుట్టిన తేదీ ధ్రువపత్రాలు సైతం ఇక్కడి సచివాలయ, ఆధార్ సెంటర్లలో తీసుకోకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాతపట్నం: అపార్‌లో నమోదు చేసేందుకు ఆధార్ కార్డులో పుట్టిన తేదీ, పాఠశాల రికార్డుల్లోని పుట్టిన తేదీ ఒకేలా ఉండాల్సి రావడంతో పాతపట్నం మండల కేంద్రంలో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం స్థానిక కోర్టు కూడలిలో ఉన్న బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయంలో ఆధార్ సెంటర్‌కు చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారు పోటెత్తారు. ఇప్పటికే ఈ కార్యక్రమం ప్రారంభమై నెల రోజులు దాటుతున్నా నమోదులో జాప్యం జరుగుతోంది.


సారవకోట: సచివాలయానికి వెళ్లి తిరిగి వస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు


పాతపట్నం: ఆధార్ సెంటర్‌లో వేచివున్న విద్యార్థులు

శ్రీముఖలింగంలో పారిశుద్ధ్య పనులు


చెత్తను తొలగిస్తున్న దృశ్యం

జలుమూరు: మండలంలోని శ్రీముఖలింగం ప్రధాన ఆలయం ముందు, వెనుక భాగంతో పాటు మాడవీధులు సైతం శుభ్రం చేసి చెత్త, వ్యర్థాలు తొలగిస్తున్నామని పంచాయతీ కార్యదర్శి చిన్నాల శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఆదివారం సాక్షి దినపత్రికలో ముక్కు మూసుకోవాల్సిందే అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆలయ వెనుక భాగంలో పేరుకుపోయిన చెత్తను యంత్రాలతో తొలగించామన్నారు. మరో వారం రోజులు పాటు ఈ పారిశుద్ధ్య పనులు కొనసాగుతాయన్నారు.